సాక్షి విశాఖపట్నం

బుధవారం । 1 । జనవరి । 2025



కొంగొత్త ఆశలతో.. కొత్త ఏడాదిలోకి..

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పాత క్యాలెండర్‌తో 12 నెలల సావాసం ముగిసింది. ఇంటి గోడతో కొత్త క్యాలెండర్ నేస్తరికం కట్టింది. గత ఏడాదిలో చూసిన విజయాలు, అపజయాలు, సుఖాలు, దుఃఖాలు జ్ఞాపకాలైపోయాయి. కొత్త సంవత్సరం.. కోటి ఆశలతో రానే వచ్చింది. నూతన సంవత్సరం ఆరంభం అంటేనే మన జీవితంలోకి నూతనత్వాన్ని ఆహ్వానించడం. నవ్య ఆలోచనలు మన మస్తిష్కంలో వికసించాలి. నిరంతరం నూతనోత్తేజం ప్రవహించాలి. సానుకూల దృక్పథంతో కొనసాగడం, ప్రతికూల ఫలితాలు ఎదురైనా వాటిని స్వీకరించగల మనస్తత్వం కలిగి ఉండాలి. నూతన పరిచయాలు, స్నేహాలు మన జీవితంలోకి వస్తుంటాయి. అవి మన ఆలోచనలను ప్రభావితం చేసే ప్రయత్నం చేయవచ్చు. కానీ మన సహజ స్వభావాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని చేరుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేయాలి. నిరాశకు తావు లేకుండా, సానుకూల దృక్పథంతో ఈ నూతన సంవత్సరంలో మన ప్రయాణం సాగాలి.

మలేరియా కార్మికులకు షాక్!



- కొత్త సంవత్సరం రోజు తొలగింపు
- రోడ్డున పడ్డ 431 మంది కార్మికులు
- తమ పొట్టకొట్టారంటూ ఆందోళన

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కొత్త సంవత్సరంలో కూటమి ప్రభుత్వం సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్లకు (మలేరియా కార్మికులు) షాక్ ఇచ్చింది. జీవీఎంసీ మలేరియా విభాగంలో పనిచేస్తున్న 431 మందిని జనవరి 1వ తేదీ నుంచి పనిలోకి రావద్దంటూ ఆదేశాలు జారీచేసింది. రోజువారీ వేతనం ఆధారంగా పనిచేస్తున్న వీరిని తొలగిస్తూ ఆదేశాలు జారీకావడంతో.. వారంతా ఘొల్లుమంటున్నారు. కొత్త సంవత్సరంలో తమ పొట్టకొట్టారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జీవీఎంసీ పరిధిలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వం 431 మంది సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్లను 2023 సెప్టెంబర్‌లో పనిలోకి తీసుకుంది. ఇందులో 25 మంది కేజీహెచ్, విక్టోరియా గవర్నమెంట్ హాస్పిటల్లో పనిచేస్తున్నారు. అప్పటి నుంచి వీరు విశేష సేవలందిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో వీరి సేవలను కొనసాగించాల్సిన అవసరం ఉంది. సీజన్ ముగిసినందున వీరి అవసరం లేదని పేర్కొంటూ తొలగిస్తున్నట్టు జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (సీఎంహెచ్‌వో) ఆదేశాలు జారీ చేశారు.

జోన్ల వారీగా వివరాలు

జోన్	వార్డులు	సిబ్బంది
జోన్-1	4	18
జోన్-2	9	79
జోన్-3	14	45
జోన్-4	12	25
జోన్-5	24	63
జోన్-6	20	98
జోన్-7	5	25
జోన్-8	10	53
మొత్తం	98	406

కేజీహెచ్, విక్టోరియా గవర్నమెంట్ హాస్పిటల్లో మరో 25 మంది పనిచేస్తున్నారు.

పనిలోకి తీసుకోవద్దు..!

తుపాన్‌ల వల్ల మొన్నటివరకు వర్షాలు విరివిగా కురవడంతో ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండిపోయింది. ఇక్కడ యాంటీ లార్వా ఆపరేషన్లను నిర్వహించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా నగరంలో ఇప్పటికీ దోమల బెడద తీవ్రంగా ఉంది. వీటిని నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ ప్రక్రియ చేపట్టాలి. అయితే ఇది సరిగ్గా జరగడం లేదు. ఈ పరిస్థితుల్లో సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్ల అవసరం ఎంతైనా ఉంది. కానీ భారం పేరుతో కొత్త సంవత్సరం మొదటి రోజు నుంచే వీధుల్లోకి తీసుకోవద్దంటూ జోనల్ మలేరియా అధికారులకు జీవీఎంసీ ఆదేశాలు జారీచేయడంతో వారంతో గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఉన్న ఉపాధిని తీసేస్తోందని మండిపడుతున్నారు.

అర్థాంతరంగా ఆపేస్తే ఎలా?



మలేరియా, డెంగీ వ్యాధుల నియంత్రణ చర్యల అమలుకు సీజనల్ యాంటీ లార్వా ఆపరేషన్ వర్కర్లను తీసుకున్నారు. ఇప్పుడు అర్థాంతరంగా ఆపేస్తే ఎలా? నగర ప్రజలకు దోమలు కుట్టవా? జబ్బులు, జ్వరాలు రావా.? ఈ విషయమే బయాలజిస్ట్‌ని కలిసి చెప్పా. అందుకు బయాలజిస్ట్ స్పందిస్తూ త్వరలోనే తీసుకునే ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు.

– పి.వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షుడు, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

గ్రాండ్ వెల్‌కమ్





ఆక్సిజన్ టవర్స్ వద్ద యువత కేరింత





ఏయూక్యాంపస్: కాలగమనంలో మరో ఏడాది కలిసిపోయింది. కొత్త ఆశలతో కొత్త సంవత్సరం వచ్చేసింది. దీంతో ఉత్సాహం ఉరకలేసింది. ఆనందం అర్ణవమైంది. నయా జోష్‌తో నగరం హోరెత్తింది. డీజేలు.. ఆటాపాటలతో కొత్త సంవత్సరానికి యువత స్వాగతం పలికింది. 2024కి బై బై.. 2025కు వెల్కమ్ అంటూ హడావుడి నెలకొంది. మంగళవారం సాయంత్రం నుంచే సందడి మొదలు కాగా.. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ కొత్త సంవత్సర శోభ కనిపించింది. పూల దుకాణాలు, స్వీట్ షాపులు, బేకరీలు జనంతో కిటకిటలాడాయి. మద్యం దుకాణాలు, బార్‌లు కిక్కిరిశాయి. క్లబ్బులు, షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లు, రిసార్ట్స్ వినోదాత్మక ఈవెంట్లతో అలరించాయి. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యువత రోడ్లమీదికొచ్చి ఉత్సాహంగా గడిపారు. కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మిరుమిట్లుగొలిపే విద్యుత్ కాంతులు.. సంగీతపు హోరు.. నోరూరించే విందు భోజనాలకు పలు హోటళ్లు, రెస్టారెంట్లు వేదికలయ్యాయి. పిల్లలు, పెద్దలు, యువత సాంస్కృతిక ప్రదర్శనలు అపార్టుమెంట్‌వాసులను అలరించాయి. ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రత్యేక థీమ్‌లతో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. లైవ్ మ్యూజిక్‌తో పాటు అన్‌లిమిటెడ్ ఫుడ్, బేవరేజెస్‌ను అందించాయి.

బొకేలు, పండ్లు తీసుకురావొద్దు



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. వేడుకల్లో భాగంగా శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు పూల బొకేలు, పండ్లు, కేకులు, స్వీట్లు, ఇతర బహుమతులు తీసుకురావొద్దని మనవి. దేశ మాజీ ప్రధాని మృతికి సంతాప సూచికగా అధికారులు, సిబ్బంది ఈ విషయంలో సహకరించాల్సిందిగా కోరుతున్నాను. ఎవరైనా బహుమతులు ఇవ్వాలనుకుంటే.. నిరుపేద విద్యార్థులకు సహాయపడేందుకు నోటు పుస్తకాలను స్వచ్ఛందంగా అందజేయవచ్చు. నిరుపేదల ముఖాల్లో సంతోషం నింపుతూ సమాజానికి ఆదర్శంగా నిలుద్దాం.

– ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, కలెక్టర్





లక్ష్యసాధనకు కష్టపడదాం



కలలు కనండి.. వాటి కోసం పరితపించండి.. అనుకున్నది సాధించండి. మనం ఎంచుకున్న రంగంపై స్పష్టమైన అవగాహన ఉంటే సులువుగా రాణించవచ్చు. అపజయాలు ఎదురయ్యాయని నిరుత్సాహపడవద్దు. విజయం సాధించామని గర్వపడొద్దు. ఎందుకంటే ఆ రెండు మన చేతుల్లోనే ఉంటాయి. యువతీయువకులు లక్ష్యసాధనపై దృష్టి పెట్టండి. కొత్త ఏడాదిలో చరిత్ర సృష్టిద్దాం.

– ఛరిష్మా, మిస్ సౌత్ ఇండియా విన్నర్ 2022, విశాఖపట్నం


ఎట్టకేలకు..!

- ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం
- సెర్చ్ కమిటీకి ఈసీ నామినీ పేరు
- వీసీ నియామకంలో ముందడుగు



విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నియామకంలో ముందడుగు పడింది. రాష్ట్ర స్థాయి 'సెర్చ్ కమిటీ'కి వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ నుంచి నామినీ పేరును ఎట్టకేలకు ఖరారు చేశారు. ఏయూలో మంగళవారం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఉన్నత విద్యామండలి నుంచి కౌన్సిల్‌లోని కీలక సభ్యులుగా ఉన్న అధికారులు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొనగా, ఇక్కడ అందుబాటులో ఉన్న మిగతా సభ్యులంతా హాజరై నామినీపై తుదినిర్ణయం తీసుకున్నారు. దీంతో వీసీ నియామకానికి లైన్ క్లియర్ అయినట్లయింది. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా జి.శశిభూషణరావు ఉన్నారు. రెగ్యులర్ వీసీ నియామకంపై కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వీసీ ఎంపిక కోసం రాష్ట్ర స్థాయిలో ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం, యూజీసీ నుంచి ఒక్కో సభ్యుడి పేరు ఖరారు చేసినా, ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి సభ్యుడి పేరును సిఫార్సు చేయటంలో తీవ్ర జాప్యం నెలకొంది. ఇటీవల ఉన్నత విద్యామండలి చైర్మన్ నియామకం జరగడంతో దీనిపై కదలిక వచ్చింది. వీసీ పోస్టు కోసం సెర్చ్ కమిటీ ముగ్గురు పేర్లను సూచిస్తే, అందులో ఒకరిని గవర్నర్ ఫైనల్ చేయనున్నారు. ఇదిలా ఉండగా, ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కీలకమైన ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు, రెక్టార్ కిశోర్ బాబు హాజరుకాకుండానే సమావేశం ముగిసింది. ఈ ముగ్గురు వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేయడంతోనే కౌన్సిల్ సమావేశానికి దూరం కావాల్సి వచ్చింది. నామినీ పేరు ఖరారైన నేపథ్యంలో త్వరలోనే వీసీ పోస్టుపై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

పెన్సిల్ మొనపై..





నూతన సంవత్సరానికి ఓ యువకుడు వినూత్న రీతిలో స్వాగతం పలికాడు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని సిద్ధేశ్వరానికి చెందిన ద్వారపూడి అశోక్ తన అద్భుత ప్రతిభతో పెన్సిల్ మొనపై 2025ని చెక్కి అందరినీ అబ్బురపరిచాడు. - పెదగంట్యాడ

నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



డాబాగార్డెన్స్: విశాఖ నగర ప్రజలకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు.

కిక్కే కిక్కు

- భారీగా మద్యం విక్రయాలు
- 30, 31 తేదీల్లో రూ. 23 కోట్లు తాగేశారు
- 1వ తేదీన రూ.12 నుంచి రూ.15 కోట్ల విక్రయాలకు అవకాశం?

విశాఖ సిటీ: మందుబాబులకు కొత్త సంవత్సరం ముందే వచ్చేసింది. 30వ తేదీ నుంచే సెలబ్రేషన్స్ ప్రారంభించేశారు. మద్యం కిక్కును ఎంజాయ్ చేస్తున్నారు. కేవలం రెండు రోజుల్లోనే రూ.23 కోట్ల మద్యం తాగేశారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎక్సైజ్ శాఖ ద్వారా భారీగా ఆదాయం సమకూరుతుందని కూటమి ప్రభుత్వం భావించింది. అందుకు తగ్గట్టుగానే 31, 1వ తేదీల్లో అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. దీంతో ఈ రెండు రోజులు రూ.30 కోట్లు మేర ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు సైతం భావిస్తున్నారు. అయితే అనూహ్యంగా కొత్త సంవత్సరానికి ముందే మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. ఆదివారం నుంచే మందుబాబులు న్యూ ఇయర్ జోష్‌లో ఉన్నారు. దీంతో 30న రూ.14.5 కోట్లు అమ్మకాలు జరిగితే.. 31న రూ.8.5 కోట్లు మద్యం విక్రయాలు జరిగాయి. ఈవెంట్ల నిర్వాహకులతో పాటు పార్టీలు చేసుకునే వారు ముందస్తుగానే మద్యం కొనుగోలు చేశారు. ఫలితంగా నూతన సంవత్సరానికి ముందే మద్యం ఆదాయం పెరిగింది. ఒకటో తేదీన రెట్టింపు స్థాయిలో జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా ఈ న్యూ ఇయర్‌లో ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.35 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశముంది.

నేటి నుంచే ప్లాస్టిక్ నిషేధం

అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో బుధవారం నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి రానుంది. మానవాళితో పాటు ఇతర జీవరాశులకు ఎంతో హాని చేసే ప్లాస్టిక్ కారణంగా క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులు సంభవిస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించింది. అందుకు అనుగుణంగా మార్కెట్లు, రైతు బజార్లు, పండ్ల దుకాణాల వద్ద అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఇప్పటికే ప్రత్యామ్నాయాలు, ఇన్‌స్పెక్షన్ సిద్ధాంతాలపై స్కిల్ అప్‌గ్రేడేషన్ ట్రెనింగ్ ప్రోగ్రాంలు నిర్వహించారు. అదనపు కమిషనర్ ఆర్ సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు, ఏఎంవోహెచ్‌లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్ట్రీట్‌వెండర్స్, వర్తక వ్యాపారస్తులు, జోన్ల కార్యదర్శులతో జూమ్ యాప్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

120 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ నిషేధం

జనవరి ఒకటో నుంచి 120 మైక్రాన్ల లోపు ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమలవుతుంది. దీన్ని అతిక్రమించిన చిన్న వ్యాపారులకు తొలిసారి రూ.2,500, రెండోసారి రూ.5 వేల అపరాధ రుసుంతో పాటు వారి ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయనున్నారు. జీఎస్టీ పరిధిలో ఉన్న బడా వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగించినా మొదటిసారి పట్టుబడితే రూ.20 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.40 వేల అపరాధ రుసుంతో పాటు వారి అన్ని వ్యాపార లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, కలెక్టర్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.



ఎన్‌ఏడీలో దుకాణదారుడికి నోటీసు అందిస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ మూర్తి

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

ప్రపంచ పర్యావరణాన్ని నాశనం చేస్తోన్న ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమేద్దాం. ఐదేళ్లుగా ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నాం. వీటికి ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులో ఉన్నాయి.

– గొలగాని హరి వెంకట కుమారి, నగర మేయర్

కఠిన చర్యలు తప్పవు

ప్రభుత్వ నిబంధనల మేరకు 120 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్‌పై నిషేధం ఉంది. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. వ్యాపార లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తాం. జోనల్ స్థాయిలో జోనల్ అధికారులతో ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశాలిచ్చాం.

– డాక్టర్ పి.సంపత్‌కుమార్, కమిషనర్, జీవీఎంసీ

నగర సమగ్ర ప్రగతికి కృషి

మేయర్ గొలగాని హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కార్పొరేటర్లు, జిల్లా యంత్రాంగంతో కలిసి నగరాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. 2024లో సాధించిన ప్రగతి, గుర్తించిన లోపాలను సరిదిద్దుకుని.. 2025లో విశాఖ నగర సమగ్ర అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని మేయర్ వెల్లడించారు.

'2024-25 సంవత్సరానికి జీవీఎంసీ పరిధిలో రూ.185.21 కోట్ల అంచనాలతో 813 పనులు చేపట్టగా, రూ.18.19 కోట్లతో 197 పనులు పూర్తయ్యాయి. రెండు దశల్లో రూ.131.84 కోట్లతో 22 ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రతిపాదించగా, 13 పనులు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. రూ.5.28 కోట్లతో 2,771 పాత్‌హోల్స్ పూడ్చాం. రూ.36.33 కోట్ల అంచనాలతో ఐదు స్టేడియంల పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.10.53 కోట్ల అంచనాలతో ఆరు శ్మశాన వాటికల మరమ్మతు పనులు చేపట్టగా, ఒకటి పూర్తయింది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద రూ.1000 కోట్లతో 61 పనులు చేపట్టగా, రూ.672 కోట్లతో 58 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లో ఏడీబీ నిధులతో రూ.447.62 కోట్లతో చేపట్టిన 24 గంటల మంచినీటి సరఫరా పథకం పనులు 71 శాతం పూర్తయ్యాయి. అమృత్ 2.0 పథకంలో భాగంగా మంచినీటి సరఫరా అభివృద్ధికి రూ.356.42 కోట్లతో 27 ప్రాజెక్టులు చేపట్టగా, పీపీపీ పద్ధతిలో రూ.150 కోట్లతో ఒక ప్రాజెక్టు, రూ.26.42 కోట్లతో నాలుగు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జాతీయ స్థాయిలో 4వ పరిశుభ్ర నగరంగా గుర్తింపు, వరుసగా మూడేళ్లపాటు వాటర్‌ప్లస్ ధ్రువీకరణ, 5 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ రేటింగ్ విశాఖకు లభించాయి. 2024లో 143 మలేరియా, 642 డెంగ్యూ, 5 చికెన్ గున్యా కేసులు నమోదయ్యాయి. 2024లో 15,096 జననాలు, 14,968 మరణాలు సంభవించాయి. 1,44,680 మందికి నెలకు రూ.62.78 కోట్ల పింఛన్లు చెల్లిస్తున్నాం. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా 3,385 బిల్డింగ్ అప్లికేషన్లు మంజూరు చేయగా రూ.110.25 కోట్లు, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ద్వారా 2,686 దరఖాస్తులు పరిష్కరించగా రూ.65.7 కోట్లు జీవీఎంసీకి ఆదాయం వచ్చింది. 84.84 కిలోమీటర్ల పొడవున 15 మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు జరుగుతున్నాయి. 2024-25 సంవత్సరానికి రూ.470 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకోగా, డిసెంబర్ 16 వరకు రూ.283.59 కోట్లు వసూలయ్యాయి. ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద ఏప్రిల్‌లో రూ.118.58 కోట్లు వచ్చాయి. జీవీఎంసీకి స్వచ్ఛ భాగీదారి పురస్కారం, పీఎం స్వనిధి ప్రథమ స్థాన పురస్కారం జీవీఎంసీకి లభించాయి.' అని మేయర్ వివరించారు. ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కొత్త ఏడాదిలో అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

పింఛన్ల కోసం తప్పని తిప్పలు

- జిల్లాలో 95.35 శాతం మందికి పింఛన్ల పంపిణీ
- మిగిలిన వారికి నేడు, రేపు అందజేత



పింఛన్ల కోసం పెదజాలరిపేట సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు

మహారాణిపేట: ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఒక రోజు ముందుగానే జిల్లా యంత్రాంగం చేపట్టింది. జనవరి ఒకటో తేదీ నూతన సంవత్సరం కావడంతో మంగళవారం 95.35 శాతం మందికి పింఛన్లు అందజేశారు. జిల్లాలో మొత్తం 1,61,271 మంది పింఛన్‌దారులకు గానూ ప్రభుత్వం రూ.69,85,78,500 విడుదల చేసింది. ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేయాల్సి ఉన్నా.. పెదజాలరిపేట తదితర ప్రాంతాల్లో అందరినీ ఒకచోటకు పిలిపించి అందజేశారు. పెదజాలరిపేటలో అయితే మధ్యాహ్నం 12 గంటల తర్వాత పంపిణీ ప్రారంభించారు. రాత్రి 7 గంటల సమయానికి 95.35 శాతం మందికి అంటే 1,53,774 మందికి పింఛన్లు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగర పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో బయోమెట్రిక్ గుర్తింపు ద్వారా సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి బుధ, గురువారాల్లో పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

'స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి'

ఏయూక్యాంపస్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవింద రావు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఉత్తరాంధ్రకు చెందిన పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఉత్తరాంధ్రలోని ఫార్మా పరిశ్రమల్లో 371డీ ప్రకారం 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు కల్పించాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని కోరారు. విశాఖ నగరాన్ని ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలని, మెట్రోరైలు ప్రాజెక్టును సత్వరం ప్రారంభించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు.

దివ్యాంగులతో సదరంగం

- నేటి నుంచి సదరం సర్టిఫికెట్ల జారీకి బ్రేక్
- దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లపై కూటమి కుట్ర



మహారాణిపేట : దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కుట్రకు సిద్ధమవుతోంది. వారికి అందించే పింఛన్‌లో భారీగా కోత విధించాలని ఆలోచన చేస్తోంది. తద్వారా పింఛన్ భారాన్ని తగ్గించుకోవాలని భావిస్తోంది. ఒకవైపు ఉన్న వారిని తగ్గించడంతో పాటు తనిఖీల పేరుతో కొత్త లబ్ధిదారులు పింఛన్ పొందే అవకాశం లేకుండా చేస్తోంది. ఇందులో భాగంగా జనవరి ఒకటో తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ల జారీకి బ్రేక్ వేసింది. దీంతో ఈ ప్రక్రియ నిలిచిపోనుంది. దీని వల్ల దివ్యాంగ పింఛన్ కోసం కొత్తగా ఎవరూ దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

సదరం కీలకం

దివ్యాంగ పింఛన్‌కు సదరం సర్టిఫికెట్ ఎంతో కీలకం కానుంది. ఇది లేకుండా పింఛన్ పొందే అవకాశం లేదు. ఆర్థోపెడిక్, అంధత్వం, వినికిడి, మానసిక రుగ్మతలు, శారీరక వైకల్యం, మానసిక, శారీరక లోపాలు, దృష్టిలోపంతో బాధపడే వారి వైకల్యాన్ని నిర్ధారిస్తూ సదరం సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే దివ్యాంగులకు పింఛను, ఉద్యోగాల భర్తీ, బస్ పాస్, ఇతర సదుపాయాలు వర్తిస్తాయి. ఈ సర్టిఫికెట్ లేకపోతే దివ్యాంగులుగా గుర్తించే అవకాశం లేదు. తాజాగా పింఛన్ల భారాన్ని తగ్గించుకోడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో దివ్యాంగులు మిగిలిన రాయితీలు, సౌకర్యాలు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో దివ్యాంగుల్లో కలవరం మొదలైంది.

వారంలో 240 నుంచి 280 మంది దరఖాస్తు

కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ విక్టోరియా, ఈఎన్‌టీ, మానసిక ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. వారంలో 240 నుంచి 280 మంది సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వైద్య పరీక్షలు పూర్తయిన 15 రోజుల్లో సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా జారీ అయ్యేవి.

3 నుంచి తనిఖీలు

ఈనెల 3వ తేదీ నుంచి సదరం సర్టిఫికెట్ ద్వారా పింఛన్లు పొందుతున్న వివరాలపై సర్వే చేయనున్నారు. సదరం సర్టిఫికెట్ ద్వారా మంచానికి పరిమితమైన పలువురికి, 80 శాతం నుంచి వంద శాతం వైకల్యం ఉన్నవారికి నెలకు రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. దివ్యాంగుల్లో కేటగిరీని బట్టి రూ.5 వేలు, రూ.10వేలు,రూ.15 వేలు చొప్పున ఇస్తున్నారు. అలాగే కిడ్నీ డయాలసిస్ రోగులకు కూడా రూ.15 వేలు పింఛను అందజేస్తున్నారు. కూటమి పింఛన్ల భారం తగ్గించేందుకు దివ్యాంగుల్లో అనర్హులున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టింది. అనర్హుల ఏరివేత పేరుతో పింఛన్ల భారం తగ్గించుకోవాలని చూస్తోంది. పింఛన్లు పొందుతున్న వారికి ప్రత్యేక వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమాచారాన్ని వివిధ శాఖల అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి గానీ, దివ్యాంగుల శాఖ నుంచి గానీ ఎలాంటి సమాచారం రావడం లేదు. సదరం నిలుపుదల చేశామని, 3వ తేదీ నుంచి సర్వే జరుగుతుందని మాత్రమే చెప్పి తప్పించుకుంటున్నారు.

నేటి నుంచి రైళ్ల వేళల్లో స్వల్పమార్పులు

తాటిచెట్లపాలెం: కొత్త సంవత్సరం తొలి రోజు నుంచి పలు రైళ్ల వేళలు మారాయి. ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరే, ఆయా స్టేషన్‌లకు చేరుకునే సమయాల్లో స్వల్పమార్పులు చేశారు. విశాఖకు చేరుకునే సమయం, ఇక్కడి నుంచి బయల్దేరే రైళ్ల సమయాలివీ..

	నడిచేరోజులు	ప్రస్తుత సమయం	మారిన సమయం
కిరండూల్-విశాఖపట్నం(18513)	ప్రతీరోజు	తెల్లవారు 2.40	తెల్లవారు 3.40
ఎల్‌టీటీ-విశాఖపట్నం(22848)	బుధ	ఉదయం 05.10	ఉదయం 5.20
సికింద్రాబాద్-విశాఖపట్నం(12784)	ఆది	ఉదయం 9.50	ఉదయం 9.45
భగత్‌కి కోటి-విశాఖపట్నం(18574)	సోమ	ఉదయం 10.00	ఉదయం 10.05
సికింద్రాబాద్-విశఖపట్నం(20707)	గురువారం మినహా	మధ్యాహ్నం 1.50	మధ్యాహ్నం 1.45
దుర్గ్-విశాఖపట్నం(20829)	గురువారం మినహా	మధ్యాహ్నం 1.45	మధ్యాహ్నం 1.50
భువనేశ్వర్-విశాఖపట్నం(22819)	ప్రతీరోజు	మధ్యాహ్నం 3.25	మధ్యాహ్నం 3.30
రాజమండ్రి-విశాఖపట్నం(67295)	ప్రతీరోజు	మధ్యాహ్నం 2.50	సాయంత్రం 4.50
కోరాపుట్-విశాఖపట్నం(58537)	ప్రతీరోజు	సాయంత్రం 5.05	సాయంత్రం 5.15
పలాస-విశాఖపట్నం(67293)	ప్రతీరోజు	సాయంత్రం 5.50	సాయంత్రం 6.00
అమృత్‌సర్-విశాఖపట్నం(20808)	సోమ,మంగ,శుక్ర	రాత్రి 9.40	రాత్రి 9.50
సాయినగర్ షిర్డీ-విశాఖపట్నం(18504)	శని	రాత్రి 9.40	రాత్రి 9.50
సికింద్రాబాద్-విశాఖపట్నం(20834)	మంగళ మినహా	రాత్రి 9.31	రాత్రి 9.35
విశాఖపట్నం-రాయ్‌పూర్(58528)	ప్రతీరోజు	ఉదయం 4.25	ఉదయం 4.20
విశాఖపట్నం-సికింద్రాబాద్(20708)	గురువారం మినహా	మధ్యాహ్నం 2.35	మధ్యాహ్నం 2.30
విశాఖపట్నం-కాకినాడ(17268)	ప్రతీరోజు	సాయంత్రం 5.05	సాయంత్రం 5.00
విశాఖపట్నం-దుర్గ్(18530)	ప్రతీరోజు	సాయంత్రం 4.55	సాయంత్రం 4.50
విశాఖపట్నం-షాలిమర్(22854)	బుధ	మధ్యాహ్నం 3.25	మధ్యాహ్నం 3.35
విశాఖపట్నం-ధీఘా(22874)	గురు	మధ్యాహ్నం 3.30	మధ్యాహ్నం 3.35
విశాఖపట్నం-గాంధీదాం(20803)	గురు	సాయంత్రం 5.35	సాయంత్రం 5.30
విశాఖపట్నం-కోర్బా(18518)	ప్రతీరోజు	రాత్రి 9.05	రాత్రి 9.10
విశాఖపట్నం-బనారస్(18311)	బుధ,ఆది	ఉదయం 4.20	ఉదయం 4.15
కోరాపుట్-విశాఖపట్నం(18511)	మంగళ,శని	మధ్యాహ్నం12.00	మధ్యాహ్నం 2.45

హోటళ్లు, లాడ్జిల్లో విస్తృత తనిఖీలు



హోటల్‌లో రికార్డుల్లో పరిశీలిస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: నగరంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కమిషనరేట్ పరిధిలో ఉన్న హోటళ్లు, లాడ్జీలు, హాస్టళ్లపై దాడులు చేశారు. మంగళవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకకాలంలో 136 పోలీస్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని 162 హోటళ్లు, లాడ్జీలలోను, 65 హాస్టళ్లలోను సోదాలు చేపట్టారు. అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలపైనే కాకుండా అసాంఘిక కార్యకలాపాలు, నిందితులు, పాస్‌పోర్ట్ లేకుండా, వీసీ గడువుకు మించి ఉన్న విదేశీయుల ఉన్నారా? ఇలా అనేక అంశాలను పరిశీలించారు. ఇందులో 30 హోటళ్లు, లాడ్జీలకు అగ్నిమాపక ఎన్‌వోసీలతో పాటు ట్రేడ్ లైసెన్సులు లేకుండా 16, జీఎస్టీ సర్టిఫికేట్లు లేకుండా 15 హోటళ్లు, లాడ్జీలు వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే 3 హోటళ్లలో రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని, 23 హాస్టళ్లలో సందర్శకుల రికార్డులు సక్రమంగా లేదని, 23 హోటళ్లు, లాడ్జీలలో వీఎంఎస్‌లో సందర్శకుల సమాచారాన్ని అప్‌డేట్ చేయడం లేదని, 10 హోటళ్లలో సీసీటీవీలను పర్యవేక్షించడం లేదని తెలుసుకున్నారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు.

19 మంది స్వీపర్ల నియామకం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ స్టేషన్ల పరిశుభ్రత, నిర్వహణ కోసం 19 మంది స్వీపర్లను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం నియమాక పత్రాలను అందజేశారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో సీపీ తనిఖీలు



ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

సీతంపేట: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం నగర ఆర్మ్‌డ్ రిజర్వ్‌ను సందర్శించారు. సిబ్బంది విధులను సమీక్షించారు. అడ్మిన్, సిటీ సెక్యూరిటీ వింగ్, వెల్ఫేర్, క్వార్టర్ మాస్టర్, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రికార్డులన్నీ పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర తెలిపారు. మంగళవారం ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం 2025, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్. కె. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీవీఎస్ ప్రసాద్, జిల్లా సంఘం అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. సీతారామరాజు, గౌరవాధ్యక్షుడు యూ.కూర్మారావు, జిల్లా సంఘం ట్రెజరర్ ఎస్.త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



ఏర్పాట్లపై దేవస్థానం ప్రధానార్చకుడు, అధికారులతో చర్చిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై ఈనెల 10వ తేదీన జరగనున్న వైకుంఠ ఏకాదశికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. మంగళవారం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. స్వామి వేంజేసే ఉత్తర ద్వారం వద్ద ఏర్పాటు చేయనున్న వేదిక, దాని ఎదురుగా క్యూల ప్రణాళికలపై చర్చించారు. విద్యుత్ దీపాలంకరణ, భక్తులకు మంచినీటి సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, అన్నప్రసాదం, పారిశుధ్య పనుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, దేవస్థానం ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో కానిస్టేబుళ్ల అభ్యర్థులకు కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. 600 మంది అభ్యర్థులకు 221 మంంది హాజరయ్యారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో పోలీస్ అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, బ్యాగేజ్ కౌంటర్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజకల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ) నిర్వహించారు. అనంతరం 1,600 మీటర్లు, 100 మీటర్లు పరుగు పోటీలు, లాంగ్ జంప్ నిర్వహించారు. పోటీల నిర్వహణలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ టి.కల్యాణి, ఆర్ఐలు మన్మథరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

బ్రేకులు ఫెయిలై.. షాపులోకి దూసుకెళ్లి..

- బీభత్సం సృష్టించిన లారీ
- ఒకరు మృతి.. డ్రైవర్‌కు గాయాలు
- ప్రమాదం నుంచి తప్పించుకున్న మహిళ



గొలిశెట్టి వెంకటరమణ మృతదేహం



షాపులోకి దూసుకెళ్తున్న లారీ

అక్కిరెడ్డిపాలెం: బ్రేకులు ఫెయిలైన ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. ఎత్తు నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఓ షాపులోకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందారు. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన ఓ మహిళ త్రుటిలో తప్పించుకుని ప్రాణాలతో బయటపడింది. గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలివీ.. సుందరయ్య కాలనీలోని పాత కర్ణవానిపాలెంలో నివాసం ఉంటున్న గొలిశెట్టి వెంకటరమణ(58) స్టీల్ ప్లాంట్‌లోని కోక్ ఓవెన్స్ విభాగంలో సీనియర్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం తన ఇంటి దగ్గరలోని జిరాక్స్ షాపునకు పనిమీద వెళ్లారు. అదే సమయంలో ఇసుక లోడుతో వస్తున్న లారీ ఎత్తు నుంచి దిగుతుండగా బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అదుపు తప్పి నేరుగా షాపులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ వెంకటరమణను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ రామసత్యప్రసాద్ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ దూసుకొస్తుండటం చూసిన ఓ మహిళ వెంటనే పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న గాజువాక ఎస్ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వెంకటరమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వెంకటరమణకు భార్య నాగలక్ష్మి, కుమార్తె ఉన్నారు. ఆయన మధ్యాహ్నం విధులకు వెళ్లాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

ఏడు కేసుల్లో ముగ్గురు దొంగల అరెస్ట్

రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి సామగ్రి స్వాధీనం



మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మణరావు, చిత్రంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 7 కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు వెస్ట్ జోన్ క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు తెలిపారు. వారి నుంచి రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తెలిపిన వివరాలు..

సుజాతనగర్ ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన చాగంటి నాగరత్నం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని బంధువు మరణంతో అక్కడకు వెళ్ళారు. ఈ నెల 19న తిరిగి వచ్చారు. ఈ క్రమంలో ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని బీరువాలో దాచిన 4 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు కనిపించలేదని నాగరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు మరో ఆరు హౌస్ బ్రేకింగ్ ఘటనలలో వెండి, రాగి వస్తువుల చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ముద్దాయిలు అల్లిపురానికి చెందిన ఉమ్మిడి సతీష్, ఎరిపల్లి మూర్తి, షేక్ నజీర్‌లను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. వీరు ముగ్గురు గత కొంత కాలంగా పెందుర్తి ప్రాంతంలోనే చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. వెస్ట్ జోన్ సీఐ(ఇంచార్జి) శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయా కేసులను పెందుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు బృందం దర్యాప్తు చేసిందన్నారు. క్రైం ఎస్ఐ డి.సూరిబాబు, హెచ్‌సీలు జి.నాగరాజు, ఎం.ఎస్.నాయుడు, ఆర్.శ్రీరాం, ఎన్. భవాని, పీసీలు టి.శివప్రసాద్, ఎల్.తాతారావు, ఆర్.వెంకటేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

తమిళనాడుపై విదర్భ విజయం

విశాఖ స్పోర్ట్స్: విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్-డి పోటీల్లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ ఆరు వికెట్ల తేడాతో తమిళనాడుపై గెలుపొందింది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు మరో ఎనిమిది బంతులుండగానే 256 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ తుషార్(75) అర్ధసెంచరీతో రాణించగా వన్‌డౌన్‌లో వచ్చిన ప్రదోష్ 28 పరుగులు చేశాడు. విజయ్‌శంకర్ 17, కెప్టెన్ సాయికిషోర్ 14 పరుగులు చేయగా, సిద్ధార్థ్(40) మహ్మద్‌అలీ(48) జోడి ఆరో వికెట్‌కు 70 పరుగులు అందించింది. నాల్కండే ఆరు వికెట్లు తీయగా హర్షదూబే రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన విదర్భ ఓపెనర్లు ధ్రువ్ 31, రాథోడ్ 14 పరుగులతో పెవిలియన్‌కు చేరగా వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ కరణ్ 111(14 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగులతో అజేయంగా నిలిచాడు. యష్(31), కీపర్/బ్యాటర్ శర్మ(23) నిలకడగా రాణించారు. దూబే 39 పరుగులతో నిలిచాడు. దీంతో నాలుగు వికెట్లు మాత్రమే నష్టపోయి 257 పరుగులతో జట్టు విజయాన్నందుకుంది. దీంతో విదర్భ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలతో 16 పాయింట్లు సాధించి గ్రూప్-డి లో ఆధిక్యంలో కొనసాగుతోంది.

షెడ్యూల్ కులాల గణనపై 7 వరకు అభ్యంతరాల స్వీకరణ

మహారాణిపేట: షెడ్యూల్ కులాల గణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. గతంలో ప్రకటించిన మేరకు గడువు డిసెంబర్ 31తో ముగియనుండగా జనవరి 7వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలు జనవరి 17వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.